





# పాఠశాల అభివృద్ధికి యువత చేయూత




**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

మండలంలోని గుండారం గ్రామానికి చెందిన యువకులు తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించి ఆదర్శంగా నిలిచారు. పాఠశాల తమను ఉన్నత స్థాయికి తీసుకెళ్లిందనే ఆలోచనతో వాసంపల్లి రాజు తన స్నేహితుడు వడ్లకొండ నరేష్‌తో కలిసి గుండారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉండ్రాళ్ల తిరుపతి, ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను కలిసి పాఠశాల రూపురేఖలు మార్చాలని ప్రతిపాదించారు. ఈ ఆలోచనను స్నేహితులు శ్రీనివాస్, రాజు, నరేష్, అనిల్ తదితరులతో పంచుకోగా, అందరూ కలిసి సుమారు రూ.40 వేల సొంత ఖర్చుతో కేవలం మూడు రోజుల్లో పాఠశాలకు రంగులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. జాతీయ, రాష్ట్ర చిహ్నాలు, భారతదేశం, తెలంగాణ చిత్రపటాలతో పాటు పండ్లు, కూరగాయలు, ఎక్కాలు, నెలలు, వారాల వివరాలను గోడలపై చిత్రించారు. యువకుల సేవలను గ్రామస్థులు అభినందించగా, పాఠశాల కొత్త రూపంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. తాము చదువుకున్న పాఠశాలకు, సొంత గ్రామానికి సేవ చేస్తున్న గుండారం యువకులు ఇతర గ్రామాల యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు






# విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా
- రెసిడెన్షియల్ స్కూల్ సందర్శన

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో మరమ్మతులు పూర్తయ్యే వరకు విద్యార్థులను ముక్రాంపురంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు తరలించి అక్కడే తరగతులు కొనసాగించాలని సూచించారు. డాక్టర్ స్ట్రీట్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను గురువారం పరిశీలించిన కలెక్టర్ లీకేజీలు, కిచెన్ షెడ్డు, తాగునీరు, టాయిలెట్ల సమస్యలను గుర్తించారు. వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. అనంతరం ముకరపురంలోని ఓల్డ్ హైస్కూల్ క్యాంపలోని ఇంటిగ్రేటెడ్ బాలుర హాస్టల్‌ను పరిశీలించి విద్యార్థులకు వసతి, భోజనం, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ కోఆర్డినేటర్లు అశోక్‌రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# ఆరుతడి పంటల సాగును పెంచాలి

- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా
- వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



జిల్లాలో ఆరుతడి పంటల సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు విస్తృతంగా వివరించి, వాటి సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు. శుక్రవారం రాత్రి కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల సాగుపై ఆమె సమీక్ష నిర్వహించారు. గత ఏడాది, ప్రస్తుత ఏడాది ఆరుతడి పంటల సాగు విస్తీర్ణంపై వివరాలు తెలుసుకున్నారు. గత ఏడాది జిల్లాలో సుమారు 6 వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 16 వేల ఎకరాల్లో సాగు చేసినట్లు అధికారులు వివరించారు. గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. మొక్కజొన్న, వేరుశనగ, ఆయిల్‌పామ్‌తో పాటు కూరగాయలు, పండ్ల తోటల సాగుపై రైతులు ఆసక్తి చూపేలా క్షేత్రస్థాయిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పంటల ఎంపిక నుంచి సాగు విధానాల వరకు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, హుజురాబాద్ వ్యవసాయ అధికారి భూమ్ రెడ్డి, జమ్మికుంట వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ బైక్ ర్యాలీ

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ తాడికల్ గ్రామం నుంచి కేశవపట్నం బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలతో ప వందేమాతరం, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమం లో బీజేపీ అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొమురయ్య, వంకాయగూడెం సర్పంచ్ వెన్నెం మల్లేష్, రాస మల్ల శ్రీనివాస్, దండు కొమురయ్య,దొంగల రాములు, వీరార్జున్, చర్ల శ్రీనివాస్ నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.'





# విజయ డైరీకి పునర్వైభవం

- పాడి రైతులకు అండగా నిలుస్తాం
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- విజయ డైరీ సందర్శన

**శెనార్తి మీడియా, హనుమకొండ:**

విజయ డైరీని పునరుద్ధరించి పాడి రైతులకు అండగా నిలిచేందుకు త్వరలో ప్రత్యేక కార్యాచరణ చేపడతామని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. డైరీ అభివృద్ధితో పాటు పాడి రైతులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గురువారం విజయ డైరీని సందర్శించిన కలెక్టర్ పాల సేకరణ, శీతలీకరణ కేంద్రాలు, ప్రయోగశాల, పాల ఉత్పత్తుల తయారీ ప్రక్రియను పరిశీలించారు. పశుసంవర్ధక శాఖతో విజయ డైరీని అనుసంధానం చేసి రైతులకు ఆధునిక పశుపోషణ, పశువైద్య సేవలు, పాల ఉత్పత్తి పెంపుపై అవగాహన కల్పించాలని సూచించారు. నెయ్యి, పన్నీరు తదితర పాల ఉత్పత్తుల తయారీని విస్తరించేందుకు ఆధునిక యంత్రాలు, అవసరమైన మౌలిక వసతులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 26 సొసైటీల ద్వారా రోజుకు సుమారు 6 వేల లీటర్ల పాలను ప్రాసెసింగ్ చేస్తున్నామని, ఈ సామర్థ్యాన్ని 15 వేల లీటర్లకు పెంచడమే లక్ష్యమని డిప్యూటీ డైరెక్టర్ ధనరాజ్ వివరించారు.



# మాలల మహాధర్నాను విజయవంతం చేయాలి

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

ఆగస్టు 23న దుబ్బాక పట్టణ కేంద్రంలో నిర్వహించనున్న మాలల మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య పిలుపునిచ్చారు. బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాల మేరకు, రాష్ట్ర సాంస్కృతిక సారథి ఎలుక దేవయ్య సూచనలతో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ మాలలపై చూపుతున్న వివక్ష, ఏబీసీడీ వర్గీకరణ, రోస్టర్ విధానం వల్ల మాలలకు జరుగుతున్న నష్టాన్ని నిరసిస్తూ ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి నాయకులు, సిద్ధిపేట జిల్లా మాల నాయకులు, దుబ్బాక నియోజకవర్గంలోని మాల కుటుంబ సభ్యులు, నాయకులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రావుల నరసయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల శేఖర్ బాబు, దామర శంకర్, రాజ మహేందర్, మాశం బాబు, సంఘం మధు, రాకమ ఆంజనేయులు, రమేష్, సాయి, దొంతుల రాయమల్లు, తిరుపతి, చంద్రయ్య, లక్ష్మణ్, యాస బాబు తదితరులు పాల్గొన్నారు.

# పంటల రక్షణకు సాగునీరు

- కరువులో రైతులను ఆదుకుంటాం
- మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- దేవాదుల నీటి విడుదల

**శెనార్తి మీడియా, స్టేషన్ ఘనపూర్:**

కరువు పరిస్థితుల్లో రైతుల పంటలను కాపాడేందుకు దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని విడుదల చేస్తున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి శుక్రవారం ఆయన సాగునీటిని విడుదల చేశారు. నెల రోజులుగా రిజర్వాయర్లను ముందస్తుగా నింపడంతో ధర్మసాగర్, ఘనపూర్, అశ్వరావుపల్లి, గండిరామారం, బొమ్మకూరు రిజర్వాయర్లలో ప్రస్తుతం 50 శాతానికి పైగా నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో చివరి ఆయకట్టు వరకు నీరందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకొని ఇప్పటికే సాగులో ఉన్న పంటలను కాపాడుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

# తెలంగాణ రక్షణ సేనలో చేరికలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మండలంలోని మొలంగూర్, ధర్మారం, రాజాపూర్, అంబాలాపూర్, కన్నాపూర్ తదితర గ్రామాలకు చెందిన మహిళలు, యువతతో పాటు వివిధ వర్గాల ప్రజలు తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమల్ల చైతన్య నూతన సభ్యులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. 150 మందికి పైగా చేరడం పార్టీపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగంపల్లి నాగరాజు, నాయకులు ఏనుగు మల్లారెడ్డి, బొడిగ పరుశురాం గౌడ్, సౌరభ్ సింగ్, ఉమర్ జైపాల్ రెడ్డి అతహర్ దేవనూరి రవి పాల్గొన్నారు.

# ఘన వ్యర్థాలపై పకడ్బందీ చర్యలు

- పరిశుభ్రమైన జిల్లాకు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో సమీక్ష

**శెనార్తి మీడియా, హన్మకొండ:**

జిల్లాలో ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు–2026ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన హన్మకొండ జిల్లా నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శుక్రవారం ఐడీఓసీలో ఘన వ్యర్థాల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి రోజువారీ చెత్త సేకరణతో పాటు తడి, పొడి, శానిటరీ, హానికర వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేసేలా నాలుగు బిన్నుల విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. రోజుకు 50 నుంచి 100 కిలోల వ్యర్థాలు ఉత్పత్తి చేసే బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి, తడి వ్యర్థాలను అక్కడే కంపోస్టింగ్ చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై స్పాట్ ఫైన్లు విధించాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవాల నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో తడి, పొడి వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలకు జియోట్యాగింగ్ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా పంచాయతీ, కాలుష్య నియంత్రణ మండలి, జీడబ్ల్యూఎంసీ, పరకాల మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.



